## మోజు !

ఎంకి మహా పెంకి. నెమలి కంఠం నీలిరంగు జరీబుటా బెనారస్ పట్టుచీర కొనాలని క్రితం సంక్రాంతి రోజుల్లో అనుకుంది. మళ్ళీ సంక్రాంతి వచ్చేసింది చీర యింటికి వచ్చేసింది.

మడత కూడా సరిగ్గా ఊడదీయకుండానే ఆనందంతో మీద కప్పేసుకుని మంచం మీద అలానే పడుకుంది ఎంకి. అంచు అంతా జరీనగిషీ పని. పైట అంతా ఉదయ సూర్యుని కిరణాలల్లే రంగు రంగు "డిజైను". చీర అంతా జరీ బుటా. బుటా బుటాకి మధ్యలోనుంచి, బుటాకి తాకకుండా త్రాచుపాము మెలికలల్లే జరీపోగులు, ఓహ్.....

ఆ రోజు ఎప్పటిలాగానే పొలం మీద వున్న నాయుడికి భోజనం తీసుకెళదామని గుమ్మంలోకి వచ్చింది ఏంకి. మోకాళ్ళదాకా కాసె బిగించి కట్టిన, మడత నలగని చేనేత గళ్ళకోక; చింతపూలరైక; జడ చుట్ట చుట్టి కనకాంబరాలు, జాజులు తురిమిన కొప్పు; చెవులకు రాళ్ళ దుద్దులు; పుష్యరాగపు ముక్కుపుడక; పావలా బిళ్ళంత బొట్టు; కంటినిండా కాటుక; మెడలో నాల్గుపేటల నల్లపూసలు - ఎంకి అందమే అందం - అలా గుమ్మంలోకి వచ్చిందో లేదో పక్కింటి పెద్దయ్యగారి మేడ ముందు చిన్న కారాగింది. పెద్దయ్యగారి కోడలు కిన్నెర కొత్తగా కాపురానికి వస్తోంది. నెమలి కంఠం నీలిరంగు జరీబుటా బెనారస్ పట్టుచీర కట్టి, వాలుజడలో మల్లెపూలు పెట్టి, జారిపోతున్న పైటను, పొంగి పొరలుతున్న వాగు విడిపోతున్న మంచుతెరను, తన కెరటాల హస్తాలతో తిరిగి ఎదమీదికి లాక్కుంటోందా అన్నట్లుగా - సర్దుకుని కారు దిగింది.



కిన్నెర బాగా కలిగిన వాళ్ళయింటి పిల్ల. పెద్ద చదువులు చదివింది. ఊరికి కొత్త కోడలు. పైగా పల్లెటూరులోనే కాపురం వుంటానని వస్తోంది. దరిమిలా ఊళ్ళోని ఆడవాళ్ళంతా అక్కడే చేరారు. అంత మందిలో ఎంకినే చూస్తూ వెలిగిపోతున్న కళ్ళతో అలాగే నిలబడిపోయింది కిన్నెర. గుడ్లప్పగించి కిన్నెరనే చూస్తూ తనని తాను మరిచిపోయింది ఎంకి. ఆ క్షణం నుంచీ ఆ చీరమీదనే మనసుపోయింది ఎంకికి.......

మంచం మీద నుంచి లేచింది ఎంకి. కొప్పు తీసి వాలుజడ వేసింది. మల్లెపూలు తురిమింది. దుద్దులు తీసి కిన్నరల్లే జూకాలు పెట్టుకుంది. నుదుటిన దోసగింజల్లే తిలకం దిద్దింది. రెండు చేతులకి రెండు జతల గాజులే ఉంచింది లోపల పావడా తొడిగి, నెమలి కంఠం చీర కట్టింది. "మ్యాచింగ్" జాకెట్టు వేసుకుంది.

తలొంచుకుని ఒక్కసారి తానను తాను చూసుకుంది. అద్దాల గదిలో వెయ్యిదీపాలు వెలిగించినట్లు, వెయ్యి స్తంభాల మంటపంలో లక్ష గంటలు మోగించినట్టు అయింది ఎంకి మనసు. అబ్బ! ఇలా కాదు. నిలువెల్లా నిలువుటద్దంలో చూసుకోవాలి. తనింట్లో నిలువుటద్దం లేదు. ఏమైనా సరే! ఈసారి నాయుడిచేత అది కూడా కొనిపించాలి.

ఈసారికి కిన్నెర వాళ్ళ యింట్లో వుంది కదా! నాయుడు వచ్చేలోగా తనివి తీరా ఈ చీరలో చూసుకోవాలి. కిన్నెర పెనిమిటి గిరి కూడా సాయంత్రానికి గాని పట్నం నుంచి రాడు.

వాకిట్లోకి చూసింది. ఎంకి. వీధిలో ఎవరూ లేరు. పొంగిన వాగల్లే చెంగున ఈ గుమ్మంలోంచి ఆ గుమ్మంలోకి పరిగెత్తింది. బయటి గదిలో ఎవరూ లేరు. కాసేపు తటపటాయించింది. తనేమో నల్లనిది, పొలం పనులతో మోటు తేలిన మనిషి, తననీ, ఈ సుకుమారమైన చీరనీ చూసి కిన్నెర నవ్వుతుందేమో? తనెప్పుడూ ఇలాంటి చీరలు కట్టలేదు. అందులోనూ ఇలా కట్టలేదు. ఎబ్బెట్టుగా వుందేమో? ఎవరైనా చూస్తే నవ్వుతారు కూడా! తిరిగి వెళ్ళిపోదామా అనుకుంది. ఊహూ! పొంగిన వాగు ఆగుతుందా? కిన్నెరవాళ్ళ గదితలుపులు దగ్గిరగా వేసివుంటే తోసి లోపలకి తొంగి చూసింది.

అరె! ఆశ్చర్యం! ఎదురుగా నిలువుటద్దంలో ఎంకి! మోకాళ్ళదాకా కాసెబిగించి కట్టిన మడత నలగని చేనేత గళ్ళకోక! చింతపూల రైక! జడ చుట్టుచుట్టి కనకాంబరాలు, జాజులు తురిమిన కొప్పు! చెవులకు రాళ్ళ దుద్దులు! పుష్యరాగపు ముక్కుపుడక! పాపలా బిళ్ళంత బొట్టు! కంటినిండా కాటుక! మెడలో నాల్గుపేటల నల్ల పూసలు.

మతిపోయింది ఎంకికి. తనసలు నెమిలి కంఠం చీర కట్టుకోనేలేదా? కట్టుకున్నాననే భ్రాంతిలో అలానే వచ్చేసిందా? తలొంచుకుని తనని తాను మళ్ళీ చూసుకుంది. నెమలి కంఠం చీర తన ఒంటినే వుంది. అర్థం కాలేదు. ఎంకికి మరదేమటి? అద్దంలో తన గళ్ళచీర!

ఇంతలో ఎంకి మెదడులో ఏదో మెదిలింది. తను అద్దంలో చూసింది. తన ముఖం కాదే! కిన్నెర ముఖం ఔను! సందేహంగా తలెత్తి చూసింది ఎంకి. ఓరగా వున్న తలుపవతల నుంచి నవ్వుతూ యివతలకి వచ్చింది కిన్నెర.

గుడ్లప్పగించి అలానే కిన్నెరని చూస్తూ నిలబడిపోయింది ఎంకి. వెలిగిపోతున్న కళ్ళతో ఎంకిని చూస్తూ తనని తాను మరచిపోయింది కిన్నెర.

ఎంకి నవ్వింది. కిన్నెర సిగ్గుపడుపోయింది.

కిన్నెర నవ్వింది. ఎంకి సిగ్గుపడిపోయింది.

ఇద్దరూ నవ్వితే నిలువుటద్దం సిగ్గుపడిపోయింది.

ఆ రాత్రి నాయుడూ, గిరి నవ్విన నవ్వుకి పున్నమిచంద్రుడు తెల్లారేదాకా సిగ్గుపడిపోతూనే వున్నాడు.